
# పెద్దతోడు

వి. పద్మ



శివమ్మ, ఇస్త్రీ పెట్టెలో కాలి, బూడిదగా మారిన బొగ్గులను ఇంటి బయట శుభ్రంగా దులిపివేసి, కణకణా మండుతున్న ఎర్రటి బొగ్గులతో నింపి, ఇస్త్రీ బల్లమీదనే, ఒక పక్కగా నాపరాయి మీద ఉంచింది. ఇస్త్రీ బల్లమీది దుప్పటిని శుభ్రంగా దులిపి, సరిచేసింది. ఎదురుగా ఉన్న దేవుళ్ల పటాలకు శ్రద్ధగా మొక్కింది.

ఒకే గది ఉన్న పెంకుటింటిలో పోర్షన్ అది. ఆ ఒక్క గదినే దుప్పటిని తెరగా పెట్టి, రెండుగా మార్చింది. గది ముందు భాగంలో శివమ్మ వంట, నివాసం. ఇవతలి భాగంలో ఇస్త్రీ కొట్టు. అదే ఆమె వ్యాపారం, బ్రతుకు తెరువు, కడుపుకు ఇంత అన్నంపెట్టే అన్నపూర్ణ — అన్నీ అదే!

శివమ్మకు ఇద్దరు పిల్లలు. పన్నెండేళ్ళ పెద్దవాడు కేశవుడు. గవర్నమెంటు స్కూలులో ఎనిమిదవ తరగతి చదువుతున్నాడు. మూడేళ్ళ రెండవ వాడు చంటాడు. శివమ్మ భర్త రాజయ్య ఏడాదిక్రితం హఠాన్మరణం చెందడంతో, శివమ్మకు మిన్ను విరిగి మీద పడినట్లుగా అయింది.

శివమ్మ అత్తవారిది మరీ బీద కుటుంబమేమీ కాదు. ఉన్న కొద్దో గొప్పో ఆస్తినంతా శివమ్మ అత్తమ్మ 'ఆడపెత్తనం' చెలాయించి తగలేయగా మిగిలింది తన 'కడుపు' కోసం అట్టే పెట్టేసుకుంది. శివమ్మ భర్త, రాజయ్య 'సిగ్గూ, లజ్జ', 'పరువూ, మర్యాద' అంటూ బిడియపడుతూ కూర్చోక, 'తన వాటా' అంటూ తల్లి ఇచ్చిన కొద్ది డబ్బుతో ఇస్త్రీ పెట్టె కొనుక్కుని, ఇస్త్రీకొట్టు పెట్టుకున్నాడు. మొదట్లో కొంతకాలం కడుపులో కాళ్ళు పెట్టుకొని పడుకోవాల్సి వచ్చినా, అచిరకాలంలోనే అతని కుటుంబానికి పట్టెడన్నం పెట్టసాగింది 'చిల్లర మా లక్ష్మి ఇస్త్రీ కొట్టు'.

అంతా సుఖంగానే జరిగితే ఇంకా దైవాన్ని తలచేదెవరు ? 'మూడు పువ్వులు, ఆరు కాయలు'గా నడుస్తున్న కాపరంలో కడివెడు విషం వంచినట్లుగా అయింది రాజయ్య మరణం. మొదలు విరిగిన చెట్టులా అయింది శివమ్మ పని.

'ఇంకే ముంది, శివమ్మ కుటుంబం నడిరోడ్డు పాలే!' అనుకున్నారు బంధువులంతా.

'నా దగ్గరే ఉంచుకుని, చాకిరీ చేయించుకుని, ఇంత 'ముద్ద' పడేస్తా' ననుకుంది అత్తమ్మ.

'అన్నయ్య ఏమైనా 'దాచాడో' ఏమో కనుక్కోవే, అమ్మా!' సుడిగాలికి పడిపోయిన చెట్టుకి, ఏళ్ళేమయినా ఉన్నాయేమోనని వెదికే రకం ఆడపడుచు ముత్యాలు.

అత్తమ్మ ధైర్యం చేసి అడగనే అడిగింది. 'నా కొడుకు బ్రతికి ఉండగా ఏ మాత్రం వెనకవేశాడేమిటి?' అంటూ.

శివమ్మ కంట్లో నీళ్ళు తిరిగాయి. "దాచింది" అంటూ ఏమీలేదు, అత్తమ్మా! వస్తున్న కొద్దో గొప్పో కడుపు నింపుకునేందుకే సరిపోయేది!' అంది దీనంగా.

ఈ దారిన పోయే దరిద్రాన్ని నెత్తిన ఎత్తుకోక తప్పదేమోనని భయపడింది అత్తమ్మ.

'ఈ లేనిపోని గొడవ నాకెందుకు ?' అనుకుంటూ తన బట్టలు మూటకట్టుకుని, వెళ్ళేందుకు సిద్ధపడింది ఆడపడుచు.

'నాతో వచ్చేయరాదే, పనిపాటలలో సాయంగా ఉందువుగాని. నీకూ, నీ పిల్లలకూ పబ్బం గడిచిపోతుంది!' అంది అత్తమ్మ జిత్తులమారిలా చూస్తూ.

'లేదు, అత్తమ్మా! నా అదృష్టమూ, దురదృష్టమూ రెండూ ఇక్కడే ఉన్నాయి. బ్రతుకూ, చావూ రెండూ ఇక్కడే గడవనీ!' అంది శివమ్మ నిరాసక్తంగా.

'నీఇష్టం! ఆనక అత్తమ్మ పిలవలేదనే నింద నా మీద రానీయకు!' అత్తమ్మ విసురుగా లేచి బట్టలు సర్దుకుని, పదమూడో రోజు సాయంత్రమే వెళ్లిపోయింది, కూతురు ముత్యాలుతో కలిసి.

వంటరి ఇంట్లో పిల్లలను ఇద్దరినీ కడుపులో పెట్టుకుని ఉండిపోయింది శివమ్మ.

మరుసటి రోజే ఇంటి యజమానిని బ్రతిమాలుకుంది. తనను ఆ ఇంట్లోనే ఉండనీయమని. యజమాని మంచివాడు. శివమ్మ కుటుంబంపై సానుభూతి కలవాడు, 'సరే' నన్నాడు. ఆ వీధిలో అందరి

ఇళ్ళకూ వెళ్ళి చెప్పుకుంది, రాజయ్య లేకపోయినా ఇస్త్రీ దుకాణం ఎప్పటిలాగే నడుస్తుందనీ, ఇస్త్రీకి బట్టలు ఇవ్వమనీను. ఒకరకంగా వాళ్లకి కూడా తెరిపిగా అనిపించింది. రాజయ్య, శివమ్మలు తెలిసినవాళ్ళు, నమ్మకస్థులు. వాళ్ళ దుకాణంలో బట్టలు ఇచ్చి, ఒక రోజు ఆగి వెళ్ళినా, పోతాయనే భయం లేదు. అందుకే వీధిలో వాళ్ళంతా తృప్తిగా నిట్టూర్చారు.

భర్తపోయి పదమూడు రోజులయిందో లేదో ఇస్త్రీ కొట్టు తెరిచిన శివమ్మను చూసి బంధువులంతా నోళ్ళు నొక్కుకున్నారు. శివమ్మకు రోజులు ఎప్పటిలాగే నడిచిపోసాగాయి. కాకపోతే రాజయ్య ఉండగా బట్టలు అతను ఇస్త్రీ చేసేవాడు, ఆమె బట్టలు లెక్కపెట్టడం, తీసుకున్న బట్టలు జాగ్రత్తగా ఎవరికి వారివి అప్పజెప్పడం చేసేది! ఇప్పుడు ఆమె రాజయ్య స్థానంలోకి వచ్చింది. పన్నెండేళ్ళ కేశవుడు ఆమె స్థానంలోకి వచ్చాడు. కేశవుడు రోజూ స్కూలుకి వెళతాడు, ఇంట్లో అమ్మకి పనిలో సాయం చేస్తాడు, తమ్ముడిని ఆడిస్తాడు. తండ్రి మరణంతో తమపై ఎంతటి విపత్తు ముంచుకు వచ్చిందో ఆ వయస్సులోనే అర్థం చేసుకున్నాడు కేశవుడు.

ఒక మనిషి ఇంట్లో ఖాళీగా ఉండగా మీరందరూ రెక్కలు ముక్కలు చేసుకోవడం దేనికి? శివమ్మను పిలుచుకు రండి! పనిచేయించుకుని కడుపుకి 'ఇంత' పడేస్తే సరిపోదూ?' అంటూ శివమ్మ ఆడపడుచు మొగుడు, పెళ్ళాన్నీ, అత్తమ్మనూ శివమ్మ ఇంటికి పంపించాడు.

తల్ల క్రిందులయిందనుకున్న పడవ, నీటిలో సాఫీగా నడవడం చూసిన అత్తమ్మకూ, ముత్యాలుకూ మతిపోయినట్లుగా అయింది!

రాజయ్య లేడన్న ఒక్కలోపం తప్పితే, శివమ్మ హాయిగా వ్యాపారం చేసుకుంటోంది, పెద్దవాడు చదువుకుంటున్నాడు, చిన్నవాడు నవ్వుల పువ్వులు విసురుతూ,అమ్మ ఒడిలో ఆడుకుంటున్నాడు.


అత్తమ్మనూ, ఆడపడుచునూ ఆనందంగా ఆహ్వానించింది శివమ్మ, పప్పూ, కూరా వేసి కడుపునిండా అన్నం పెట్టింది, అప్పటికే విషంతో వాళ్ళ కడుపులు నిండి, పొంగి పొరులుతున్నాయని తెలియక.

'కిలో ఇరవై రూపాయలు పెట్టి పప్పు కొనుక్కు, నితింటోందే, అమ్మా!' అంది ఆడపడుచు మంటగా చూస్తూ.

'కూరలు మాత్రం తక్కువా ఏమిటి, ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి' అంది అత్తమ్మ గిన్నెలో మిగిలిన కూరనంతా కంచంలో దొర్లించుకుంటూ.

ఒక పూట అంతా దుకాణంలో కూర్చుని గమనించారు అత్తమ్మా, ఆడపడుచూ, 'వ్యాపారం ఏ మాత్రంగా నడుస్తోందా' అనుకుంటూ.

'రోజుకు ఇరవై, ముప్పై రూపాయలకు తక్కువ రాబడి లేదే, అమ్మా!' అంది ఆడపడుచు కళ్ళలో అసూయ కదలాడుతుండగా.



"అంత దగ్గరగా వెంబడించి కూడా ఆ దొంగను పట్టుకోలేదేం?" మందలించాడు ఇన్‌స్పెక్టర్

"వాడు దూరిన గదికి నో అడ్మిషన్ అని వ్రాసి ఉంది సార్!" అన్నాడు డిసిప్లిన్‌కు మారు పేరైన పోలీసువెంకటస్వామి

—సిరిసిల్లా రషీద్ దోన్కల్

'అమ్మో, అమ్మో! ఒక ఇస్త్రీ పెట్టెమీద ఇంత రాబడే! పిచ్చిముఖంలా ఇస్త్రీ పెట్టెను వీళ్ళ 'పరం' జేసి ఊరుకున్నాను గదే!' అంటూ అత్తమ్మ మనస్సులోనే గుండెలు బాదుకోసాగింది.

ఆ రాత్రి సమయం చూసి, కడుపులో విషాన్ని బయటకు వెళ్ళగ్రక్కింది. అత్తమ్మ "ముత్యాలు మొగుడు ఇస్త్రీ కొట్టు పెట్టాలని ఆలోచిస్తున్నాడే, శివమ్మా! ఈ ఇస్త్రీ పెట్టెను తీసుకువెళ్ళేందుకు వచ్చాను. మీరు మాత్రం ఇక్కడ దేనికి, అక్కడికే వస్తే అందరం హాయిగా కలిసి మెలిసి ఉండవచ్చు!'.

'అవునవును. అన్నయ్య ఎలానూ పోయాడు. మీరు ఒకళ్ళూ ఇక్కడ వంటరిగా ఉంటే, మాకు మీ గురించే ఆరాటంగా ఉంటుంది!' అంది ఆడపడుచు తన జిత్తులమారితనాన్ని వెళ్ళగ్రక్కుతూ.

శివమ్మకు ఒక్కసారిగా భూమి కంపించినట్లుగా అయింది.

'నేను ఎక్కడికీ రాను, అత్తమ్మా. ఆ ఇస్త్రీ పెట్టె రాజయ్య నుండి కేశవునికి సంక్రమించిన ఆస్తి. అది నేను ఎవ్వరినీ తీసుకోనివ్వను!' అంది శివమ్మ స్థిరంగా చూస్తూ.

పుండు మీద కారం చల్లినట్లుగా అయింది అత్తమ్మకూ, ఆడపడుచుకీ.

'అదేమిటే ? నీ పెత్తనం ఏమిటి? అది నా డబ్బుతో రాజయ్యకు కొనిపెట్టాను. వాడు పోయాక నా వస్తువు నాకు చెందవలసిందే!' అంది గొంతు పెద్దది చేస్తూ.

'అత్తమ్మా, గొంతు పెద్దది చేయకు. నలుగురినీ పిలిచానంటే అంతా కలిసి నీకే గడ్డిపెడతారు! ఇది నా ఇల్లు! నా మొగుడి ఆస్తి అనుభవించే హక్కు నాకుంది!' అంది శివమ్మ కటువుగా.

'అమ్మా, ఊరుకోవే! నీ అల్లుడిని కనుక్కుని ఏం చేయాలో ఆలోచిద్దాం!' అంది ఆడపడుచు తల్లి చెవిలో రహస్యంగా.

తల్లీ కూతుళ్ళు ఇద్దరూ మరుసటి రోజే బట్టలు సర్దుకుని వెళ్ళిపోయారు.

వాళ్ళువెళ్ళినా శివమ్మ మనస్సు మనస్సులో లేదు. ఏదో పెనుతుఫాను ముంచుకురాబోతోందని తెలిసిపోతోంది.

తన సొద ఎవరికి చెప్పుకుంటుంది? పన్నెండేళ్ళ కేశవుడికే చెప్పుకుని కళ్ళనీళ్ళు పెట్టుకుంది. వాడు మాత్రం ఏం చేయగలడు?

బట్టలు ఇస్త్రీ చేస్తూ ఆలోచనలో మునిగిపోయిన శివమ్మ, ఇంటి ముందు రిక్షా ఆగడం చూసి ఉలిక్కిపడింది.

కళ్ళలో నిలిచిన నీళ్ళను తుడుచుకుంది.

'ఇవాళో, రేపో' అంటూ ఎదురు చూస్తున్న తుఫాను ముంచుకు రానే వచ్చింది. రిక్షాలో నుండి దిగారు అత్తమ్మా, ఆడపడుచూ.

'ఏవే, బాగున్నావా?' అంటూ పలకరించింది. అత్తమ్మ నవ్వు పులుముకున్న ముఖంతో.

మామూలుగానే పలకరించి, మర్యాదలు చేసి, అన్నం వడ్డించింది శివమ్మ. కడుపు నిండా తిని, నడుములు వాల్చారు తల్లీ కూతుళ్ళిద్దరూ ప్రయాణపు బడలికతో.

కాఫీలు తాగుతూ ఉండగా, 'శివమ్మా! ఈ పట్టు చీర సాయంత్రం కల్లా ఇస్త్రీ చేసి ఉంచమంది అమ్మ!' అంటూ మంగమ్మగారి కూతురు చీర తీసుకువచ్చి ఇచ్చింది.

శివమ్మ చీరను జాగ్రత్తగా తీసుకుని బల్లమీద పెట్టింది.

'వందలు ఖరీదు చేసే చీరలు కూడా ఇచ్చి ఇస్త్రీలు చేయించుకుంటున్నారు!' అంది అత్తమ్మ చీరను చేతిలోకి తీసుకుని పరిశీలిస్తూ.

'అత్తమ్మా ఆ చీర ఇలా ఇవ్వు!' శివమ్మ ఆవిడ చేతిలో చీరను తీసుకుని ఇస్త్రీ చేయసాగింది. ఆమెకు అత్తమ్మ వైఖరి నచ్చలేదు.

అత్తమ్మ మూతి మూడు వంకరలుగా తిప్పింది. ఆడపడుచు మెటికలు విరిచింది.

'శివమ్మా! నా మాట వినవే, నీ మంచి కోసమే చెబుతున్నా. హాయిగా మాతో వచ్చెయ్యి. కలో గంజో అంతా కలిసే తాగుదాం!' అంది అత్తమ్మ నచ్చజెబుతున్నట్లుగా.

'అవును, వదినా! ఇక్కడ ఏముందని? నీకూ, పిల్లలకూ కడుపు నిండా తిండి కూడా సరిగ్గా గడుస్తున్నట్లు లేదు—' అంది ఆడపడుచు రాని కన్నీళ్ళను ఒత్తుకుంటూ.

'నిజమేనే అమ్మా! ఇంటికి వచ్చిన ఆడపడుచుకు ఇంత పసుపు కుంకుమ ఇచ్చే దిక్కు కూడా లేదు! మీ రాజయ్య ఉండగా చీరా జాకెట్టూ ఇవ్వకుండా చెల్లిని ఏనాడూ గడప దాటనిచ్చేవాడే కాదు!' అంది అత్తమ్మ ఏడుపు అందుకుంటూ.

తుపాను మొదలవబోతోందని గ్రహించిన శివమ్మ నిశ్శబ్దంగా వింటూ ఊరుకుంది.

'బెల్లం కొట్టిన రాయిలా ఏమీ మాట్లాడవేమిటే? మీరు మాతో అయినా రండి. లేదా నేను నా కొడుక్కి ఇచ్చిన ఇస్త్రీపెట్టె అయినా మా ముఖాన పడేయండి. మా దారిన మేం పోతాము!' అంది అత్తమ్మ తిక్క రేగి.

'తల్లి సొమ్ము కొడుకు కాకపోతే ఇంకెవరు

తింటారు, అత్తమ్మా? ఒక్క ఇస్త్రీపెట్టె కొనిపెట్టా వన్న మాటేగానీ, రాజయ్య నీకెన్నిసార్లు ఎంత ధన సహాయం చేయలేదు?' అంది శివమ్మ నిర్లిప్తంగా.

'ఏమిటే? ఎంతకు తెగించావే! నా కొడుకు సొమ్ము నేను తిన్నాను! నా కొడుక్కి నేను పెట్టాను! మధ్యలో నువ్వెవర్తివే?' అంది అత్తమ్మ నిప్పులుగక్కుతూ.

'నిజానికి తన వాటా కింద వచ్చిన సొమ్ముతోనే రాజయ్య ఇస్త్రీపెట్టె కొన్నాడు. తండ్రి ఆస్తి కొడుక్కి చెందుతుంది. అది కేశవుడి హక్కు!' అంది శివమ్మ ఏమీ తగ్గకుండా.

'ఎంతెంత మాటలు అంటున్నావే? 'హక్కు' అంటూ నీతులు నేర్పిస్తున్నావే? మర్యాదగా ఆ ఇస్త్రీపెట్టె ఇలా ఇస్తావా లేదా?' ఒక అడుగు ముందుకు వేస్తూ అంది అత్తమ్మ.

శివమ్మ శరీరంలో నిలువునా వణుకు మొదలయింది! అయిపోయింది! ఈ రోజుతో ఉన్న ఈ ఒక్క ఆధారం కూడా పోతుంది! తనూ, పిల్లలూ వీధిన పడక తప్పదు!

కళ్ళలో నీళ్ళు తిరుగుతూ ఉండగా, 'అత్తమ్మా! నీ మనవళ్ళ ముఖాలు చూసి అయినా దయ చూపించు! వీళ్ళ బ్రతుకులు బజార్న పడతాయి, అత్తమ్మా!' అంది శివమ్మ రెండు చేతులూ జోడిస్తూ.

'ఈ దొంగ ఏడుపులు నా దగ్గర కాదు. ఒసే అమ్మాయి! ఇస్త్రీపెట్టె లాక్కుందాం రావే!' అంది అత్తమ్మ తీక్షణంగా చూస్తూ.

ఇద్దరూ ఒక అడుగు ముందుకు వేశారో లేదో—

'అత్తమ్మా! అక్కడే ఆగు!' కటువుగా వినిపించిన స్వరం విని ఆగిపోయారు. ఎదురుగా ఇస్త్రీపెట్టె ఒక చేత్తో పట్టుకుని, నిప్పులు కురిపిస్తున్న కళ్ళతో ఉగ్రనరసింహుడిలా నిలబడి ఉన్నాడు కేశవుడు— పన్నెండేళ్ళ కేశవుడు.

నానమ్మ తనను ఏనాడూ ముద్దు చేయడం ఎరగడు వాడు. ఏనాడూ మనవడిని చేరదీసి, చేతిలో పండో, ఫలమో పెట్టిన పుణ్యాన పోలేదు ఈ నానమ్మ. తన తల్లికి 'అత్తమ్మ'గా మాత్రమే తెలుసు వాడికి. తండ్రే లేని తమకి 'నిలువు నీడ' కూడా లేకుండా చేస్తున్న కఠినాత్మురాలిగా కూడా అర్థం అయింది వాడికి!

అందుకే అప్పటి వరకూ జరుగుతున్న సంభాషణ అంతా నిశ్శబ్దంగా ఆలకిస్తున్న వాడి కడుపులో మంట చెలరేగింది.

తను వయస్సుకి మించినట్లుగా ప్రవర్తిస్తున్నానని కూడా వాడికి తెలియలేదు. ఆ క్షణంలో వాడి శరీరం వాడి అధీనంలో లేదు. చప్పున లేచి ఇస్త్రీపెట్టెను చేతిలోకి తీసుకున్నాడు.

'అత్తమ్మా! ఈ ఇస్త్రీపెట్టె మాది! మేము ఎవ్వరికీ ఇవ్వము! ముందుకు వచ్చావంటే ఈ వేడి ఇస్త్రీపెట్టెను నీ వంటికి ఆనించేస్తాను' అన్నాడు భీకరంగా చూస్తూ.

అత్తమ్మ నిర్ఘాంతపోయింది! ఇది ఆవిడ ఊహించని సంఘటన! పిల్లలు ఇంకా ఊహ తెలియని పసికందులు అనుకుంది! మనస్సు అప్పటికే వికసించిందని ఎరగదు! తన మనవడే తనని ఎదిరించేటంత పెద్దవాడయ్యాడని ఊహించని అత్తమ్మ తనకు తెలియకుండానే ఒక అడుగు వెనక్కి వేసింది.

'అదేమిట్రా, కేశవా? నేను నీ నానమ్మనిరా!' అంది మాడిన ముఖంతో.

'అవును నానమ్మవే! అందుకే మా నోటి దగ్గరి 'కూడు' కాజేయాలని చూస్తున్నావ్. నువ్వు చెడ్డ నానమ్మవి!' అన్నాడు కేశవుడు.

ఈ లోగా—ఏమయిందో ఏమో—ఏ చేయరాని పని చేసిందో ఏమో—ఆడపడుచు అత్తమ్మ చేతి మీద నెమ్మదిగా గీరి, సైగ చేసింది లోపలికి రమ్మంటూ.

కూతురి వెనకే లోపలికి నడిచింది అత్తమ్మ.

ఐదు నిముషాలలో ఇద్దరూ సంచీ సర్దుకుని బయటకు వచ్చారు.

'మేము వెల్తున్నామే, అమ్మాయి!' అంటూ అప్పటి వరకూ ఏమీ జరగనట్లుగా, జరిగినదేదీ తమకు తెలియని వాళ్ళలా బయటకు నడిచారు.

నల్లగా మబ్బులు పట్టి, భీకరమైన తుపాను కురవ వలసిన ఆకాశంలో చల్లటి గాలులు వీచి మబ్బులు తేలిపోయినట్లుగా అవడం చూసి శివమ్మ ఆశ్చర్యపోయింది.

రిక్షా ఎక్కుతున్న అత్తమ్మనీ, ఆడపడుచునీ, శివమ్మా, కేశవులూ ఇద్దరూ అయోమయంగా చూస్తూ ఉండగా —

ఈ లోగా అత్తమ్మ వెనకే లోపలి నుండి బయటికి వచ్చిన చంటాడు ఉన్నట్లుండి గట్టిగా ఏడవడం మొదలుపెట్టాడు. 'అమ్మా! మంగమ్మ గాలి పత్తు చీల!' అంటూ.

వాడి మాటలకు అర్థం శివమ్మ గ్రహించేలోగానే — కేశవుడు పెద్దపులిలా ముందుకు ఉరికాడు! కదులుతున్న రిక్షాలో అత్తమ్మ చేతిలో సంచిని లాక్కుని ఒక్క దూకు దూకాడు. 'సర్రు'మని జిప్పు తెరిచాడు. అందులో ఇంత క్రితమే ఇస్త్రీ చేసిన మంగమ్మ గారి చీర, దాసీల మధ్య గల రాకుమార్తెలా, అత్తమ్మ నూలు చీరల మధ్య మిలమిలా మెరుస్తూ కనిపించింది! పట్టు చీర తీసుకుని బ్యాగుని రిక్షాలోకి విసిరాడు కేశవుడు.

'అత్తమ్మా! మళ్ళీ ఈ గడప తొక్కావంటే మర్యాద దక్కదు! ఇక్కడ ఉన్నది కేశవుడు కాదు! రాజయ్య పెద్దకొడుకు!' అన్నాడు గాండ్రిస్తున్నట్లుగా.

కదిలి పోయిన రిక్షాలో నుంచి నల్లగా మాడిపోయిన అత్తమ్మ, ఆడపడుచుల ముఖాలు శివమ్మకు లీలగా కనిపించాయి.

ఆమె ఇంకా నిర్ఘాంతపోయినట్లుగానే కూర్చుంది.

అలా ఆమె ఎంతసేపు కూర్చుండిపోయిందో తెలియదు! ఎప్పుడు కేశవుడు మంగమ్మగారి చీర ఇచ్చేసి ఇంటికి వచ్చాడో కూడా ఆమెకు తెలియదు.

'అమ్మా! చీకటి పడింది! దీపం వెలిగించు'! అన్న కేశవుడి మాటలతో ఆమె ఈ లోకంలోకి వచ్చింది.

చుట్టూరా చీకట్లు ముసురుకుంటున్నాయి. ఆమె కలలోలా లేచి వెళ్ళి దీపం బుడ్డి వెలిగించింది.

చిన్నారి చిరు దీపం, బలమైన చీకటిని పారద్రోలి, గదినంతా తన వెలుగుతో నింపింది.

ఆ దీపపు వెలుగులో కూర్చుని కేశవుడు హోంవర్కు చేసుకోసాగాడు. దీపపు కాంతి పడి వాడి పాలబుగ్గలు మిలమిలా మెరుస్తున్నాయి. 'తల్లి ప్రేమ' తప్ప ఈ ప్రపంచంలోని 'చెడు' ఏమీ ఎరగనట్లుగా వాడి కళ్ళు అమాయకంగా చూస్తున్నాయి. తనకి తెలియకుండానే వాడి మనస్సు ఇంతగా ఎప్పుడు ఎదిగింది? ఇంతటి పెద్దరికం ఎప్పుడు వచ్చింది వీడికి?

వాడిని చూస్తున్న కొద్దీ శివమ్మ కళ్ళలో నీళ్ళు తిరిగాయి. గుండెలు ప్రేమతో పొంగాయి.

కంచాలు పెట్టి, అన్నం వడ్డిస్తూ, 'ఒరేయ్, పెద్దాడా! అన్నానికి రా'! అంది.

ఎప్పుడూ, 'కేశవా'! అనే తల్లి 'పెద్దాడా' అనే కొత్త పిలుపుతో కేశవుడి ఒళ్ళు ఒక్క క్షణం జలదరించింది. చిన్నగా నవ్వుతూ లేచి, కాళ్ళూ చేతులూ కడుక్కుని వచ్చి కంచం ముందు కూర్చున్నాడు.

వాడికి తెలుసు! ఇప్పుడు తను 'చిన్న పిల్లాడు' కాదు! ఈ ఇంటికి పెద్దతోడు — ఈ అమ్మకి అండ! ఆ సంగతి తన తల్లి ఇప్పుడే గుర్తించింది!

అమ్మా! బువ్వ పెత్తు! అంటూ కంచాన్ని 'టక టక' లాడిస్తున్న చంటాడి తల ప్రేమగా నిమురుతూ, 'అమ్మా! మంగమ్మగాలి పత్తు చీల!' అంటూ వెక్కిరించాడు కేశవుడు.

చంటాడు సిగ్గు పడుతూ నవ్వేశాడు.

పెద్ద పులిలా ఉరిమి, మింగేస్తాయేమోననిపించిన కష్టాలు, పిల్లిపిల్లతోక ముడిచినట్లుగా అయిపోవడంతో, తేలిక పడిన హృదయంతో ఇద్దరు కొడుకులతో తను కూడా నవ్వులో జత కలిపింది శివమ్మ.

●



*గుమాస్తా: రెండు సంవత్సరాల కంటే ఎక్కువ పని చేయని రేడియోకు నాలుగు సంవత్సరాల గ్యారండి రాసిచ్చారు. ఏమిటి సార్?*

*యజమాని: మనం రాసిచ్చిన కాగితం చెత్తది. సంవత్సరం కంటే ఎక్కువ కాలం ఉండదు.*

*—సి. హెచ్. మంజుభాను*
*జగిత్యాల*